క్లుప్తంగా

శ్రీమన్నారాయణకు చుండూరు నివాళులు



శ్రీమన్నారాయణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండల పరిధిలోని మండువారిపాలెం మాజీ సర్పంచ్ కారుమూడి శ్రీమన్నారాయణ గురువారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రాయపాటి అంకయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పులుసు సురేష్‌బాబు, దేవా, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ పంపిణీ



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి

కొత్తపట్నం: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ట్రావెలింగ్ అల్‌వెన్స్ కింద మంజూరైన రూ.33 వేల చెక్కును కొత్తపట్నం హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీదేవి గురువారం అందజేశారు. స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు 11 మందికి ఒక్కొక్కరికి రూ.3 వేల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ డి.సాయి కిషోర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బాలాజీ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులశాఖ ఏడీపై మంత్రికి ఫిర్యాదు

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ జి.అర్చనపై మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌డీ అమీర్ హంజా గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ మంజూరు చేసిన రుణాల రికవరీకి సంబంధించి ఏడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ పరస్పర విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దివ్యాంగులు చెల్లించిన లబ్ధిదారుని వాటాపై కూడా వడ్డీ వేసి అసలుతో కలిపి వసూలు చేస్తున్నారన్నారు. అదేంటని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే జేసీ మరొక ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. ఈ విషయంలో దివ్యాంగులశాఖ ఏడీ స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వకుండా దివ్యాంగులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. నూతన ఉత్తర్వులు రాకముందు గతంలో అక్రమంగా దివ్యాంగుల నుంచి వసూలు చేసిన అధిక వడ్డీని తిరిగి వారికి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ధూపాటి రమణయ్య, బాణవత్ వెంకటేశ్వరరావు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

చీమకుర్తి: చీమకుర్తి మండల అర్బన్, రూరల్ పరిధిలో ఉన్న రూ.9 కోట్ల విద్యుత్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని ఎలక్ట్రికల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం చీమకుర్తిలో ఎలక్ట్రికల్ డీఈ, ఏఈలతో పాటు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, మున్సిపాలిటీ, పంచాయతీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు కూడా వసూలు చేయాలని సూచించారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, ఓల్డ్ కండక్టర్లు మార్చడం, 33 కేవీ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయటం వంటి వాటిపై దృష్టి పెట్టి నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. సోలార్ వినియోగంపై వినియోగారులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో డీఈ పీ శ్రీనివాసులు, ఏడీ, ఏఈలు ఆర్.మోహన్‌రావు, టీ చంద్రశేఖర్, వీ శ్రీనివాసరావు, కే.చినబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంగా వైన్స్‌లో చోరీ

ఒంగోలు టౌన్: నగరంలో ఒక వైన్స్ షాపులో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని మంగమ్మ కాలేజీ జంక్షన్లోని గంగా వైన్స్ షాపులో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపు పైన పెంకులు తీసేసి లోపలకు ప్రవేశించిన దొంగలు కౌంటర్లోని రూ.1.70 లక్షల నగదు, 7 మద్యం బాటిళ్లను దొంగిలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీటితో చింతల..!

- చింతల గ్రామంలోని మంచినీటి చెరువు నీరు కలుషితమై ప్రజలకు అవస్థలు
- పురుగుమందుల అవశేషాలు కలుపుతున్న రైతులు, రొయ్యల చెరువుల నిర్వాహకులు
- చెరువులోని చేపలు సైతం మృత్యువాత
- మందుబాబులకు అడ్డాగా చెరువు కట్టలు
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



చెరువు కలుషితంపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు



పురుగు మందులకు చెరువులో చనిపోయిన చేపలు (ఫైల్)



చింతల గ్రామ చెరువు (ఫైల్)



పొలాలకు మందు కొట్టడానికి ట్రాక్టర్లతో నీటి కోసం వచ్చి చెరువు దగ్గరే పురుగు మందులు కలుపుతున్న దృశ్యం

ఒంగోలు సబర్బన్:

కలుషిత కోరల్లో చిక్కుకుని చింతల చెరువు విలవిల్లాడుతోంది. ఆ చెరువు నీటినే వాడుకుంటూ గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. అధికారులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నా.. స్పందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. ఒంగోలు–కొత్తపట్నం రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సముద్ర స్నానాలకు కొత్తపట్నం వెళ్లేవారితో ఆ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. పర్యాటక ప్రాంతం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వచ్చివెళ్తుంటారు. సెలవు రోజులు, వినాయకచవితి నిమజ్జనాలు, కొలుపులు, ఇతర పర్వదినాలకు ఈ రోడ్డు కోలాహలంగా ఉంటుంది. అలాంటి రోడ్డులోనే చింతల గ్రామం ఉంది. అల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పటికీ.. అల్లూరు నుంచి విసిరేసినట్లుగా ఉంటుంది. ఒంగోలు నగరపాలక సంస్థలో కలిసి ఉంటుంది. దానికితోడు ఒంగోలు నగరంలో నివసించే వారికి చింతలలోనే వేలాదిగా టిడ్కో గృహాలు కూడా నిర్మించారు. గ్రామంలో నివసించే వారికి ఒక్కటే తాగునీటి ఆదరువు. అదే చింతల చెరువు. ఈ చెరువు నుంచే చింతల గ్రామానికి తాగునీటి సరఫరా జరుగుతోంది. చెరువులో రెండు బావులున్నాయి. ఆ బావుల్లో మోటారు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా చింతలకు తాగునీరు, వాడుక నీరు విడుదల చేస్తుంటారు. గ్రామానికి ఏకైక నీటి వనరైన చెరువు ప్రస్తుతం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతోంది.

పురుగు మందుల అవశేషాలతో కలుషితం...

ఒంగోలు–కొత్తపట్నం రోడ్డు మీదనే టిడ్కో ఇళ్ల సమీపంలోనే చింతల చెరువు ఉంటుంది. చెరువుకు నలువైపులా పంట పొలాలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. పంట పొలాల వారు, రొయ్యల చెరువుల వారికి నీరు కావాలంటే ఈ చెరువు నుంచే వాడుకుంటూ ఉంటారు. అయితే, పురుగు మందులు పిచికారీ చేసేవారు మాత్రం పురుగు మందు డబ్బాలతో వస్తుంటారు. ట్రాక్టర్‌కు పురుగు మందులు పిచికారీ చేసే ట్యాంకులు తగిలించుకుని వచ్చి చెరువులోనే ఆ పురుగు మందులను నీటిలో కలుపుకుని వెళ్తుంటారు. నీటిలో కలిపిన పురుగు మందు డబ్బాలు, ప్యాకెట్లను చెరువు కట్టపైనే వదిలి వెళ్తుండటంతో అవి చెరువులోకి చేరి నీరు కలుషితమవుతోంది. దాంతో చెరువులోని చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఓ ట్రాక్టర్ ఏకంగా చెరువు లోపలకు వెళ్లి చెరువులోని బావికి తగలడంతో గిలకలు కూలిపోయాయి. బావి అంచు సైతం కుంగిపోయింది. కొత్తపట్నం వచ్చిపోయే ఆకతాయిలు, మందుబాబులు కూడా ఆ చెరువు కట్టను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. చెరువు కట్టపై మద్యం సేవించడం పరిపాటిగా మారింది. వీటన్నింటి గురించి అల్లూరు గ్రామ పంచాయతీ అధికారులుగానీ, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులుగానీ పట్టించుకోకపోవటంతో చెరువు కలుషితం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనిపై ఇటీవల ఒంగోలు కలెక్టరేట్లో స్పందన కార్యక్రమంలో స్థానికుడు ఆంజనేయులు, తదితరులు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేసి అర్జీ అందజేశారు. చెరువు నీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. చెరువు నీటి కలుషితం కారణంగా భారీ మూల్యం చెల్లించుకోకముందే అధికారులు నిర్లక్ష్యం వీడి పరిశుభ్రమైన నీటిని చింతలవాసులకు అందించాల్సిన అవసరం ఉంది.



చెరువు కట్టపై ఉన్న పురుగుమందు డబ్బాలు

అద్దెలు, వాటిపై వడ్డీలు మాఫీ చేయించండి

- ఒంగోలు ఎమ్మెల్యేకి కూరగాయల వ్యాపారుల వేడుకోలు

ఒంగోలు సబర్బన్: స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వ్యాపారులు తమ గోడు, ఆవేదనను గురువారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముందు వెళ్లబోసుకున్నారు. గత పదిరోజులుగా కూరగాయల మార్కెట్‌లోని హోల్‌సేల్, రిటైల్, చిరు వ్యాపారుల పరిస్థితి అందరికీ తెలిసిందే. ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు పోలీసులతో కలిసి వారి దుకాణాలను తొలగించి సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. చివరకు బుధవారం జరిగిన ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రత్యేకంగా కూరగాయల మార్కెట్ విషయాన్ని ప్రస్తావించి చర్చకు అవకాశం కల్పించకపోవటంతో పోడియంను ముట్టడించారు. కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే దామచర్ల సందర్శించారు. మార్కెట్ మొత్తం తిరిగి పరిశీలించారు. రిటైల్ మార్కెట్‌తో పాటు హోల్‌సేల్ మార్కెట్, మటన్, పాత ఫిష్ మార్కెట్ పరిసరాలను కూడా పరిశీలించారు. మార్కెట్ ప్రాంగణంలో సందుల్లో ఉన్న షాపులను సైతం పరిశీలించారు. అనంతరం మార్కెట్లో వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యాపారుల, సీఐటీయూ యూనియన్ నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. కూరగాయల వ్యాపారి సుబ్బారెడ్డి మార్కెట్‌లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ ప్రాంగణం కూరగాయల మార్కెట్ కోసం చేసిన ఆర్కిటెక్ట్ కాదని, వ్యవసాయ మార్కెట్ కోసం చేసిన డిజైన్ అని ఎమ్మెల్యేకు వివరించారు. అందులో భాగంగా షాపులు ఒకే చోట లేవని సందులు, గొందుల్లో ఉండటంతో వ్యాపారానికి అనుకూలంగా లేవని వివరించారు. మరో వ్యాపారి కోటిరెడ్డి మాట్లాడుతూ పాత మార్కెట్ నుంచి కూరగాయలు అమ్ముకునే వాళ్లందరం ఇక్కడకు వచ్చామన్నారు. 2019 వరకు అద్దె బకాయిలు పూర్తిగా చెల్లించామని, జీరో స్థాయికి తీసుకెళ్లామన్నారు. కరోనా వచ్చినప్పుడు మార్కెట్ మూసేశామని చెప్పారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తమతో పీవీఆర్ గ్రౌండ్‌లో షాపులు పెట్టించి మరీ ప్రజల కూరగాయల అవసరాలు తీర్చారన్నారు. అయితే కరోనాలో షాపులు సక్రమంగా తీయక పోయినా అద్దెలు చెల్లించాలని అధికారులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. గత పాలకులు అద్దెలు, అద్దెలపై వడ్డీలు కట్టవద్దంటేనే కట్టకుండా ఆగిపోయామని వివరించారు. కరోనా సమయంలో అద్దె బకాయిలు, వాటిపై వడ్డీలు మాఫీ చేస్తే వ్యాపారులు యథావిధిగా అద్దెలు చెల్లించుకుంటారని ఎమ్మెల్యేకి వివరించారు. అద్దెలు కూడా ఎక్కువగా ఉన్నాయని, వాటిని కూడా తగ్గించేందుకు ప్రయత్నించాలని కోరారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వ్యాపారులకు ఎమ్మెల్యే దామచర్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, కొత్తపట్నం సర్పంచ్, ఏఐటీయూసీ నాయకుడు ఆర్.వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై దృష్టి పెట్టాలి



కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం నాయకులు

ఒంగోలు సిటీ: అన్ని సంక్షేమ హాస్టళ్లలో ట్యూటర్లను నియమించి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం నాయకులు గురువారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జర్నలిస్ట్ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, జెడ్పీ హైస్కూళ్లు, మున్సిపల్, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించాలన్నారు. అధికారులు హాస్టల్ నిద్ర కార్యక్రమం నిర్వహించి సంక్షేమ హాస్టళ్లలోని పరిస్థితులను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా ఇంటర్, టెన్త్ పరీక్షల దృష్ట్యా ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి హాల్ టికెట్లు ఇవ్వడంతో పాటు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు సంబంధించి సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ఎగ్జామ్ సెంటర్‌కు ప్రభుత్వమే బస్సు సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎల్.రాజు, బొడ్డు శ్రీనివాసరావు, ఉబ్బ అశోక్, పి.సతీష్, సంజీవరావు, శ్రీనివాసులు, మురళి, షేక్.నసీర్, ఎలీషా, ఫయాజ్, ఎస్కే కాలేషా తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు శిక్షణ



మిర్చి పంటలో జాగ్రత్తలు వివరిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

నాగులుప్పలపాడు: మండలంలోని పోతవరం గ్రామంలో మిరప సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ మిరపలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, తెగుళ్లు, వాటి నివారణ యాజమాన్యం, పురుగు మందుల పిచికారీ విధానాలు, కాయ కోత అనంతర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మిరపలో ప్రస్తుతం తామర పురుగు ఉధృతి అధికంగా ఉందని, ఈ పురుగు ఉధృతి ఉన్నప్పుడు ఆకులు ఎర్రగా మారడం, మొక్కల పెరుగుదల తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. వీటి నివారణకు అసిటాంప్రిడ్ 0.2 గ్రాములను ఒక లీటర్ నీటికి లేదా స్పినోసాడ్ 0.25 ఎంఎల్ లేదా పిప్రో నిల్ 2 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. సామూహిక నివారణ పద్ధతి అవలంబించడం ద్వారా కొంతవరకు అరికట్టవచ్చని తెలిపారు. నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 50 చొప్పున పెట్టాలని సూచించారు. తామర పురుగును తట్టుకునే మిరప రకాలైన ఎల్సీఏ వెరైటీస్ నాటుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా పలు రాయితీలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, అందరూ వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి పి.వెంకట్రావు మాట్లాడుతూ రైతులంతా సాగుచేసిన పంటలను ఈ పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ కూడా చేయించుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో పురుగు మందులు ఉన్నాయని, కావాల్సిన రైతులకు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయిలో మిరప పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు శ్రుతి, పద్మిని, సోనీ, రైతులు పాల్గొన్నారు..

సరళాదేవినగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఒంగోలు సిటీ: నగర పరిధిలోని పేర్నమిట్టలో 48వ డివిజన్‌లోని సరళాదేవినగర్ వాసులకు వెంటనే ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ సరళాదేవినగర్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా, నారాయణ పాల్గొని మాట్లాడారు. సరళాదేవినగర్ వాసులు 20 ఏళ్లకు పైగా వివాద రహిత భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. కాలనీకి అధికారులు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారని చెప్పారు. ప్రభుత్వం భూమి లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటన చేసిందని, నేటికీ స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరళాదేవినగర్ వాసులు నివాసం ఉంటున్న స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ముత్తని అంజయ్య, అనంతలక్ష్మి, కైలా అజయ్, ఇస్తర్ల నరసింహ, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ విశిష్టతను తెలుసుకోవాలి



గోమాతల విశిష్టతను వివరిస్తున్న విశ్వంభరానందగిరిస్వామి



అష్టోత్తర శతనామ పూజలో పాల్గొన్న భక్తులు, వేద పురోహితులు

ఒంగోలు మెట్రో: సనాతన ధర్మ విశిష్టతను అందరూ తెలుసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక మంగమ్మ డిగ్రీ కాలేజీలో గురువారం ఘనంగా గోపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వామిషాలు శ్రీశ్రీ విశ్వంభరానందగిరిస్వామి, భైరవేద్వరస్వామి, శుభోదయం స్వామి, శెగ్గం శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు, మంగమ్మ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ మానం సుబ్బారావు, గోరంట్ల చిన్న రామయ్య, ఈదర హరిబాబు, యోగయ్య యాదవ్, కుర్రా ప్రసాద్‌బాబు, పాల్గొని 108 గోమాతలకు శాస్త్రోక్తంగా పూజాక్రతువులు నిర్వహించారు. గోమాత మహత్యాన్ని వివరించారు. విశ్వమాత సోషల్ సర్వీస్ ట్రస్ట్, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్, గౌతమి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు కమ్మిశెట్టి లక్ష్మీవెంకటేశ్వరరెడ్డి, రంగారావు, వేద పురోహితులు వ్యామజాల ప్రసన్నకుమార్, పవన్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో విశ్వంభరానందగిరిస్వామి గో మహత్యం, గోమాతల ఉత్పత్తుల గురించి వివరించారు. తోట ప్రవీణ్ నాయుడు గోశాలల గురించి, సనాతన ధర్మ విశిష్టత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు, మహిళా భక్తులు కోలాటం, భజనలు, భరతనాట్యం ప్రదర్శించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

సచివాలయం మూసివేసి ఉండటంపై ఫిర్యాదు



సచివాలయ సిబ్బందిని హెచ్చరిస్తున్న ఎంపీడీఓ

నాగులుప్పలపాడు: మండలంలోని కండ్లగుంట సచివాలయాన్ని గురువారం 12 గంటల వరకు తెరవలేదు. సిబ్బంది ఎవరూ రాకపోవడంతో తలుపులు మూసివేసే ఉన్నాయి. ఆ సమయంలో గ్రామస్తులు వివిధ పనులపై సచివాలయానికి వచ్చి ఎంపీడీఓ మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ కండ్లగుంట సచివాలయానికి రావడంతో సిబ్బంది ఒక్కొక్కరు విధులకు హాజరయ్యారు. వారిపై ఎంపీడీఓ మండిపడ్డారు. ప్రతిరోజూ 10.30 గంటల్లోగా విధులకు హాజరుకావాల్సి ఉండగా, 12 గంటలైనా విధులకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జియోట్యాగింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

నేడు క్విస్ ఫెస్ట్ ప్రారంభం



క్విస్ ఫెస్ట్-2025 ఏర్పాట్లను పరిశీలిస్తున్న యాజమాన్యం

- మూడు రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొననున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో క్విస్ ఫెస్ట్–2025 నిర్వహించనున్నట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్విస్ ఫెస్ట్‌ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నేషనల్ లెవెల్‌లో ఫెస్ట్ జరుగుతుందని తెలిపారు. పర్యావరణహితంగా సస్టైనబులిటీ అనే కాన్సెప్ట్‌తో రివైవ్, రీ యూజ్, రీ సైకిల్ థీమ్‌తో ఎక్స్ పో, టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందుకోసం సర్వం సిద్ధం చేశామని తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీహరికోట సతీశ్ దావన్ స్పేస్ సెంటర్‌లో రేంజ్ ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.గ్రహదొరై, 9వ తేదీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఐటీ రాయ్‌పూర్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, గెస్ట్ ఆఫ్ హానర్‌గా క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి పాల్గొంటున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు విద్యార్థులకు టెక్నికల్ ఈవెంట్స్, ఎక్స్ పో, స్పోర్ట్స్, డ్యాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి 9న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఆహ్లాదపరిచేందుకు జాయ్ రైడ్స్, మ్యూజికల్ కాన్సర్ట్ కూడా నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ సింగర్ సమీర భరద్వాజ్, బ్యాండ్ కాన్సర్ట్‌లో వారి మ్యూజికల్ నైట్ ఉండబోతోందని వెల్లడించారు.

నిత్యవసరాల ధరలు తగ్గించాలి

- ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న ఐద్వా మండల కార్యదర్శి మాలతి, తదితరులు

సంతనూతలపాడు: పెరుగుతున్న నిత్యవసర ధరలను అదుపు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్‌నగర్లో గురువారం సాయంత్రం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసరాల ధరలను వెంటనే తగ్గించాలని, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా పది రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు సరఫరా చేయాలని కోరారు. పెరిగే ధరలకు సరిపడా వేతనాలు లభించడం లేదని తెలిపారు. అదుపు లేకుండా పెరుగుతున్న ధరల వల్ల ప్రతి సామాన్య కుటుంబం అప్పుల పాలవుతోందని తెలిపారు. అన్ని రకాల సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఈ ధరల వల్ల సామాన్య ప్రజానీకం పౌష్టికాహారం తినలేకపోతున్నారని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.మల్లేశ్వరి, పి.కుమారి తదితరులు పాల్గొన్నారు.